TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక


విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని వెలియజేస్తూ... విలువలతో కూడిన జీవన శైలిలో
ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ... ప్రజల
సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి
అనుకుంటున్నారా..? బాధ్యతాయుతమైన జర్నలిజంలో
రాణించాలనుకుంటున్నారా...? అయితే రండి...
అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు
మండల రిపోర్టర్‌లు కావలెను...

సంపుటి : 1 | సంచిక :123 | prajadivvs57@gmail. com | సోమవారం 2, మార్చి 2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 4 | వెల : 3/-



## తెలంగాణలో 6,267 మెగావాట్ల విద్యుత్ డిమాండ్

వేసవి ప్రారంభంలోనే విద్యుత్ వినియోగంలో సరికొత్త రికార్డు

టీజీఎన్‌పీడీసీఎల్ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా శనివారం గరిష్ట విద్యుత్ డమాండ్. 6,057 మెగావాట్లు నమోదు కాగా ఆదివారానికి ఆ రికార్డు చెరిగిపోయింది. తాజాగా ఇవాళ చరిత్రలోనే అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ 6,267 మెగావాట్లు నమోదైనట్లు సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. దీంతో నిన్న నమోదైన హై పీక్ డిమాండ్ కొన్ని గంటల వ్యవధిలోనే అధిగమించిపోయింది. ఈ పరిణామం ఎన్‌పీడీసీఎల్ చరిత్రలో మైలురాయిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఇది సంస్థ ముందస్తుగా తీసుకున్న ప్రణాళికా బద్ధమైన

..మిగతా 2లో

## ఖమేనీ మృతికి... బదులు తీర్చుకుంటాం

### ఇరాన్ తాత్కాలిక సుప్రీంగా అయతొల్లా అరాఫీ

అమెరికా ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మృతి

పాలన కోసం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు

అమెరికా ఇజ్రాయిల్ స్థావరాలపై ఆగని ఇరాన్ దాడులు

ఖమేనీ మృతితో ముస్లిం దేశాలలో నిరసనలు, పాకిస్తాన్‌లో 12 మంది మృతి



### ట్రంప్ పర్యవేక్షణలో... ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ

అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'..

ఆపరేషన్ రోర్ ఆఫ్ ది లయన్' చేపట్టిన ఇజ్రాయెల్

అధ్యక్షుడి ఆదేశాలను అమలు చేశామన్న అమెరికా సెంట్రల్ కమాండ్

2

### దద్దరిల్లిన పశ్చిమాసియా

27 అమెరికా స్థావరాలపై ఇరాన్ ప్రతి దాడులు

2

ఇరాన్ యుద్ధానికి ఆపరేషన్ ట్రూ ప్రామిస్‌గా నామకరణం

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో ఆ దేశం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన వారసుడిగా అయతొల్లా అలిరెజా అరాఫీని ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా ఆదివారం నియమించింది. టెహ్రాన్‌లోని నివాసంపై అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఖమేనీ మరణించినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇస్లామిక్ విప్లవ నేత ఖొమేనీ మరణం తర్వాత, 1989 నుంచి ఖమేనీ ఇరాన్ అత్యున్నత నాయకుడిగా కొనసాగుతూ వచ్చారు. ఖమేనీ మరణం తర్వాత దేశ పాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్,

..మిగతా 2లో



## రాష్ట్రాన్ని పాలిస్తున్న... రియల్ ఎస్టేట్ బ్రోకర్

16 వేల కోట్లతో ఒక్క ఇల్లు పోకుండా మూసి డీపీఆర్ సిద్ధం చేశాం

మరో రెండేళ్లు ఓపిక పట్టండి : మూసీ దండి మార్చ్‌లో పాల్గొన్న కేటీఆర్

అధికారంలోకి వచ్చిన రోజు నుంచి రాష్ట్రంలో బుల్డోజర్ రాజ్యం నడుస్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఇండ్లను కూలగొట్టడం భూములను అమ్మడం, రియల్ ఎస్టేట్ బ్రోకర్ దందా చేయడం ఇదే రేవంత్ రెడ్డి పరిపాలన అని విమర్శించారు. మూసి పేరిట తాను చేస్తున్న స్కామ్ కోసం వేలాదిమంది ఇండ్లను రేవంత్ కూలకొడుతున్నారని మూసి బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌లో మూసీ బాధితుల కోసం నిర్వహించిన 'మూసీ దండి మార్చ్' పాదయాత్రలో

..మిగతా 2లో

## బంగాల్‌లో 50 లక్షల మంది చొరబాటుదారులు

చొరబాటుదారులకు అండగా మమతా బెనర్జీ

బంగాల్‌కు విముక్తి కల్పించడమే లక్ష్యం:

బీజేపీ చీఫ్ నతిన్ నబీన్ కీలక వ్యాఖ్యలు

2

## అమరావతిలో జ్యుడీషియల్ అకాడమీ

సుప్రీం కోర్టు సీజేఐ శంకుస్థాపన

165 కోట్ల వ్యయంతో 4.83 ఎకరాల్లో నిర్మాణం


ఆధునిక హంగులతో నాలుగు ప్రత్యేక బ్లాకులు

కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు



ఆంధ్రప్రదేశ్ న్యాయ వ్యవస్థ చరిత్రలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ చేతుల మీదుగా ఆదివారం అమరావతి సమీపంలోని పిచ్చుకలపాలెం వద్ద ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి ఘనంగా శంకుస్థాపన జరిగింది. రాష్ట్రంలో న్యాయ మూర్తులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన శిక్షణ అందించే లక్ష్యంతో, సుమారు రూ.165 కోట్ల భారీ వ్యయంతో ఈ అకాడమీని నిర్మిస్తున్నారు.మొత్తం 4.83 ఎకరాల విస్తీర్ణంలో, 2.05 లక్షల చదరపు అడుగుల నిర్మాణ వైశాల్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. అమరావతిలోని ఏపీ హైకోర్టుకు కేవలం 5.7 కిలోమీటర్ల దూరంలో, 50 మీటర్ల వెడల్పు కలిగిన రహదారి పక్కన ఈ అకాడమీని ఏర్పాటు చేస్తుండటంతో దీనికి అద్భుతమైన కనెక్టివిటీ ఉండనుంది. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఒకేసారి 120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చే సామర్థ్యంతో దీనిని

..మిగతా 2లో




## మోసం చేయడంలో పోటీ పడుతున్న డీఎంకే మంత్రులు

కాంగ్రెస్-డీఎంకేపై ప్రధాని మోదీ ఘాటు వ్యాఖ్యలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం రెండు దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. పుదుచ్చేరిలో రూ. 2,700 కోట్లు, తమిళనాడులో రూ. 4,400 కోట్ల విలువైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను ఆయన ప్రారంభించారు. తమిళనాడులో కొత్తగా నిర్మించిన ఎనిమిది అమృత్ భారత్ రైల్వే స్టేషన్లు, మూడు కొత్త ఆల్ ఇండియా రేడియో ఎఫ్ ఎం రిలే ట్రాన్స్మిటర్లను కూడా ఆయన ప్రారంభించారు. ఆ తర్వాత ప్రధాని మోదీ మధురైలో జరిగిన సభలో ప్రసంగించి డీఎంకే పార్టీ తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.ఎన్డీయే తరపున ఆదివారం మధురైలో బహిరంగ సభ జరిగింది. ఈ సమావేశంలో పాల్గొనేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మధురై వచ్చారు. తరువాత, ఆయన రూ.4,400 కోట్ల విలువైన సంక్షేమ సహాయాన్ని అందించారు. అనంతరం మురుగన్ మొదటి నివాసమైన తిరుపరంకుండ్రం సుబ్రమణ్య స్వామి ఆలయంలో దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, వెట్రివేల్, వెట్రివేల్, వెట్రివేల్ అంటూ తమిళంలో మాట్లాడుతూ ఉత్సాహం నింపారు. అమ్మ

..మిగతా 2లో

## పేలుడు పదార్థాల కంపెనీలో భారీ విస్ఫోటనం



17 మంది సజీవ దహనం..

మరో 18 మందికి తీవ్ర గాయాలు

ఘటనా స్థలికి చేరుకున్న దర్యాప్తు బృందాలు,అదుపులోకి వచ్చిన మంటలు

మహారాష్ట్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. నాగ్‌పుర్ జిల్లాలోని పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో భారీ పేలుడు సంభవించి 17 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయారు. మరో 18 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, జిల్లాలోని కాటోల్ తహసీల్ పరిధిలోని

..మిగతా 2లో

## తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్న వైసిపి

సోషల్ మీడియాలో తనపై

డీప్‌ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం

టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఫైర్

సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడి



2



## వెలుగుమట్ల బాధితులకు... ఈనెల 15లోపు పట్టాలిచ్చి ఇళ్లు కట్టిస్తాం

మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది..

మీకు అండగా నిలుస్తాం

వెలుగుమట్ల నిర్వాసితులకు మంత్రి పొంగులేటి అభయం

పదేళ్లు కళ్లు మూసుకుని ఇప్పుడొచ్చి ముసలి కన్నీరా?

ప్రతిపక్షాలపై మంత్రి పొంగులేటి ధ్వజం

అప్పులు చేసి నిర్మించుకున్న ఆశల గూడు కూలిపోయిందని ఆవేదన చెందకండి.. ఈ ప్రభుత్వం మీది.మీ కన్నీరు తుడిచే బాధ్యత నాది. అర్హులైన ప్రతి పేదవాడికి ఈ నెల 15వ తేదీలోపు ఇళ్ల స్థలాల పట్టాలతో పాటు రూ. 5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెలుగుమట్ల బాధితులకు భరోసానిచ్చారు.ఆదివారం ఖమ్మం ఐడిఒసి వేదికగా జరిగిన బాధితుల ముఖాముఖిలో మంత్రి వారి కష్టాలను స్వయంగా విని చలించిపోయారు.

**దళారుల నుంచి డబ్బులు వసూలు చేయించి ఇస్తామని హామీ**

వెలుగుమట్ల భూదాన్ భూముల్లో కొన్నేళ్లుగా దళారుల ఉచ్చులో చిక్కి, నిరుపేదలు అనుభవిస్తున్న

..మిగతా 2లో

ప్రజా దివాస్ తెలుగు దినపత్రిక



# వెలుగుమట్ల బాధితులకు... ఈనెల 15లోపు పట్టాలిచ్చి, ఇళ్లు కట్టిస్తాం

నరకయాతన మంత్రి ఎదుట వెలుగుచూసింది. తక్కువ ధరకే స్థలం వస్తుందని నమ్మి, రెక్కాడితే గానీ డొక్కాడని తాము రూ. 30 వేల నుంచి రూ. 8 లక్షల వరకు అప్పులు చేసి దళారులకు చెల్లించామని మంత్రి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తీరా ఇల్లు కట్టుకున్నాక అధికారులు వచ్చి కూల్చేయడంతో తామంతా దిక్కుతోచని స్థితిలో పడ్డామన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ఒక్క పైసా కూడా ఎవరికీ లంచం ఇవ్వాల్సిన పనిలేదని, పేదల రక్తం తాగిన ఆ దళారుల నుంచి డబ్బును రికవరీ చేయిస్తామని బాధితులకు గట్టి హామీ ఇచ్చారు.

**చీకటి బతుకుల నుంచి వెలుగు కాలనీల వైపు**

గత 9 నెలలుగా కరెంటు, నీరు, ఇతర మౌలిక సదుపాయాలు లేక చీకట్లో మగ్గుతున్నామని బాధితులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన మంత్రి... కేవలం ఇళ్ల స్థలాల పట్టాలు ఇవ్వడమే కాకుండా, కొత్తగా నిర్మించే కాలనీల్లో అన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. రోడ్లు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీతో పాటు అంగన్వాడీ, పాఠశాలలను ప్రభుత్వమే ఏర్పాటు చేస్తుందని వివరించారు. నియోజకవర్గాల వారిగా బాధితులను గుర్తించి, వారి వారి ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన పునరావాసం కల్పిస్తామని స్పష్టం చేశారు.

**రాజకీయ శవాల మీద చిల్లర ఏరుకోవద్దు**

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో... బాధితుల సానుభూతి కోసం పాకులాడుతున్న ప్రతిపక్ష నేతలపై మంత్రి పొంగులేటి నిప్పులు చెరిగారు. పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు ఈ పేదలు గుర్తుకు రాలేదా అని నిలదీశారు. అధికారం పోగానే షెడ్ల కింద కూర్చుని డ్రామాలు ఆడుతున్నారని, రాజకీయాల కోసం పేదలను కవచంలా వాడుకోవడం మూర్ఖత్వమని మండిపడ్డారు. మీ పార్టీ ఏదైనా సరే.. మీరు నిజమైన పేదలైతే ఈ ప్రభుత్వం మీకు ఇల్లు ఇచ్చి తీరుతుందని, రాజకీయాలకు అతీతంగా పారదర్శకమైన సర్వే ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ప్రకటించారు.

**అర్హులకే పట్టా.. మార్చి 15 'డెడ్ లైన్'**

గతంలో లబ్ధి పొందిన వారిని ఏరివేసి, కేవలం నిరుపేదలకే న్యాయం జరిగేలా సమగ్ర సర్వే నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 15వ తేదీన తానే స్వయంగా వచ్చి అర్హులైన కుటుంబాలకు ఇళ్ల స్థలాల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల ఆర్డర్లు అందజేస్తానని మంత్రి భరోసా ఇచ్చారు. అధికారులే నేరుగా బాధితుల వద్దకు వస్తారని, మరోమారు మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, సీపీ సునీల్ దత్, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మట్టా దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

# చంద్రబాబును కలిసిన నూతన సీఎస్

### బాధ్యతలు స్వీకరించిన సాయి ప్రసాద్

ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా (సీఎస్) బాధ్యతలు స్వీకరించిన సాయి ప్రసాద్, ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ఈ భేటీ జరిగింది. సీఎస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన తొలిసారిగా ముఖ్యమంత్రిని కలిశారు. ఈ సందర్భంగా నూతన సీఎస్ సాయి ప్రసాద్‌కు సీఎం చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర పరిపాలనా యంత్రాంగానికి అధిపతిగా బాధ్యతలు స్వీకరించినందుకు ఆయనను అభినందించారు. ా మరోవైపు, ముఖ్యమంత్రి కార్యాలయంలో కీలక బాధ్యతలు చేపట్టిన మరో అధికారి కూడా చంద్రబాబును కలిశారు. సీఎంకు ఎక్స్ అఫిషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా నియమితులైన విజయానంద్ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు.

## తిరుమల పవిత్రతను దెబ్బతీస్తున్న వైసిపి

### సోషల్ మీడియాలో తనపై డీప్‌ఫేక్ వీడియోలతో దుష్ప్రచారం

### టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఫైర్

### సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడి

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఛైర్మన్ బీఆర్ నాయుడు తనపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారంపై తీవ్రంగా స్పందించారు. కొందరు తన ప్రతిష్ఠకు భంగం కలిగించేందుకు నకిలీ డీప్‌ఫేక్ వీడియోలను సృష్టించి వ్యాప్తి చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏఐ సాంకేతికతను ఉపయోగించి తన రూపాన్ని అనుకరిస్తూ వీడియోలు తయారు చేసి, తనను వ్యక్తిగతంగా అప్రతిష్ట పాలుచేసేందుకు కుట్ర పన్నుతున్నారని తెలిపారు. ఈ మేరకు బీఆర్ నాయుడు సోషల్ మీడియా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. "ఈ కంటెంట్ మొత్తం అసత్యమైనది, వక్రీకరించినది. టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు పన్నిన పథకం ఇది. దీని వెనుక రాజకీయ దురుద్దేశం ఉంది. వైసీపీకి చెందిన కొందరు ఈ తప్పుడు ప్రచారాన్ని వ్యాప్తి చేస్తున్నారని ఆరోపించారు. ఈ వ్యవహారంపై చట్ట ప్రకారం ముందు కెళతానని స్పష్టం చేశారు. ఈ దుష్ప్రచారం వెనుక ఉన్న కుట్రను తేల్చాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆయన వెల్లడించారు. తన వ్యక్తిత్వాన్ని హననం చేస్తూ టీటీడీ ప్రతిష్ఠను దెబ్బతీస్తున్న వ్యక్తులను, దుష్ట శక్తులను వదిలే ప్రసక్తే లేదని బీఆర్ నాయుడు హెచ్చరించారు. దోషులు ఎవరైనా కఠిన చర్యలు తప్పవని ఆయన తేల్చి చెప్పారు. కాగా, వైసీపీ తన సోషల్ మీడియా ఖాతాలో ఇవాళ కొన్ని వీడియోలను పంచుకుంది. ఈ వీడియోలపైనే బీఆర్ నాయుడు తీవ్రంగా స్పందించారు.

## మోసం చేయడంలో పోటీ పడుతున్న డీఎంకే మంత్రులు

**మొదటి పేజీ తరువాయి...**

మీనాక్షి సుందరేశ్వరర్ అశీస్సులు అందరికీ ఉండాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు. తిరుపరంకుండ్రం వెళ్ళినప్పుడు బాధగా ఉందని ప్రధాని మోదీ భావోద్వేగానికి లోనయ్యారు. "నేను తిరుపరంకుండ్రం మురుగన్ ఆలయంలో దర్శనం చేసుకున్నాను. అది దైవికం. తమిళనాడు ప్రజల కోసం, మొత్తం దేశం కోసం నేను దేవుడిని ప్రార్థించాను. దర్శనం చేసుకున్నప్పుడు నాకు చాలా బాధగా అనిపించింది. తిరుపరంకుండ్రం కొండపై దీపం వెలిగించి ఆత్మహత్య చేసుకున్న పూరణచంద్రన్ పట్ల నాకు జాలిగా ఉంది" అని ఆయన అన్నారు. మరోవైపు తమిళనాడు డీఎంకే ప్రభుత్వంపై ప్రధాని మోదీ విరుచుకు పడ్డారు. మోసం చేయడంలో డీఎంకే మంత్రులు పోటీ పడుతున్నారన్నారు. తమిళనాడు ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వాన్ని తీసుకు రావాలని నిర్ణయించుకున్నారని, రాష్ట్రంలో స్వచ్ఛమైన ప్రభుత్వాన్ని అందిస్తామని ప్రధాని హామీ ఇచ్చారు. డీఎంకే ప్రభుత్వం తమిళనాడును దోచుకుంటోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. మధురై ప్రజలు ఎంజీఆర్ వెంట నిలిచారు. అందుకే డీఎంకేకు మధురై నచ్చలేదు. 2021లో అధికారంలోకి వచ్చిన డీఎంకే అవినీతికి పాల్పడి, కుటుంబ పాలన నడిపి ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని ప్రధాని మోదీ విమర్శించారు. తమిళనాడులో తదుపరి ప్రభుత్వం ఎన్డీఏ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నుంచి స్వాతంత్ర్యం పొందిన తొలి రాష్ట్రం తమిళనాడు. తమిళనాడు 60 సంవత్సరాలుగా కాంగ్రెస్‌ను రాష్ట్రానికి దూరంగా ఉంచిందని మండిపడ్డారు. అందుకే కాంగ్రెస్ ఆ దీవిపై మసి పూసి మోసాన్ని పరిష్కరించింది. ఆ సమయంలో డీఎంకే నోరు మూసుకుని మౌనంగా ఉండి పోయిందని ఆయన ధ్వజమెత్తారు.

## అమరావతిలో జ్యుడీషియల్ అకాడమీ

**మొదటి పేజీ తరువాయి...**

తీర్చిదిద్దుతున్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జె.కె. మహేశ్వరి, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్.వి.ఎన్. భట్టి, జస్టిస్ జోయా మల్యా బాగ్చి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్యామల రావు, గుంటూరు కలెక్టర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యుడీషియల్ అకాడమీ, అమరావతి అభివృద్ధి పనులపై ప్రత్యేక ఆడియో–వీడియో డాక్యుమెంటరీని ప్రదర్శించారు. ఈ అకాడమీ పూర్తయితే రాష్ట్రంలో న్యాయ శిక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అధికారులు తెలిపారు.

## తెలంగాణలో 6,267 మెగావాట్ల విద్యుత్ డిమాండ్

**మొదటి పేజీ తరువాయి...**

చర్యల ఫలితమని స్పష్టం చేశారు. రోజురోజుకు ఎండలు పెరుగుతుండటంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని తెలిపారు. అయినప్పటికీ, ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామని, మౌలిక వసతుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టామని తెలిపారు. డిమాండ్ ఎంత పెరిగినా సరఫరాలో అంతరాయం రాకుండా విద్యుత్ అందించేందుకు సంస్థ పూర్తిగా సమాయత్తమై ఉందని సీఎండీ పునరుద్ఘాటించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, దిశానిర్దేశంతో వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. వచ్చే వేసవిలో డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, అందుకు సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా చర్యలు తీసుకుంటున్నామని సీఎండీ వివరించారు.



## బాణ సంచా మృతులకు పరిహారం పంపిణీ

వేట్లపాలెం బాణసంచా పేలుడు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన రూ 20 లక్షలు నష్టపరిహార చెక్కులను ఆదివారం రాష్ట్ర పర్యట శాఖ మంత్రి కందుల దుర్గేష్ పంపిణీ చేశారు. కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ , కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు డిసిసిబి ఛైర్మన్ తుమ్మల రామస్వామి లతో కలిసి అయినా ఆయా గ్రామాల్లో పర్యటించారు. సామర్లకోట, మేడపాడు, పెద్ద బ్రహ్మదేవం, గూడపర్తి గ్రామాల్లో పర్యటించి పేలుడు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంతటి స్థాయిలో ప్రమాదం సంభవించడం దురదృష్టకర మన్నారు మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుం దని క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు చేపడుతున్నట్టు తెలిపారు.

## రాష్ట్రాన్ని పాలిస్తున్న... రియల్ ఎస్టేట్ బ్రోకర్

**మొదటి పేజీ తరువాయి...**

కేటీఆర్ పాల్గొన్నారు. మూడున్నర కిలోమీటర్ల పాటు అనేకమంది బాధితులను కలుస్తూ ముందుకు సాగారు. ఆ తర్వాత మధు పార్క్ రిడ్జ్ అపార్ట్‌మెంట్ దగ్గర జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. ఒక్క రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు తమ భూములను, అపార్ట్‌మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని, ఈ పోరాటంలో భారత రాష్ట్ర సమితి వారికి అండగా ఉంటుందని, తిరిగి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ కోసం ఎవరి భూములు, ఇళ్లు పోకుండా చూస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. అపార్ట్‌మెంట్ వాసులు, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ఎన్ని రకాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా వేడుకున్నా చివరికి పసిపాపల పట్ల కనికరం చూపాలని కోరినా.. కర్కశంగా ఇళ్లను ఖాళీ చేయిస్తూ బెదిరింపులకు దిగుతూ విధ్వంసానికి పాల్పడుతున్నదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఇప్పటికే అద్భుతమైన ప్రగతి భవన్ సిద్ధంగా ఉన్నా దాన్ని కాదని చెప్పి 200 కోట్ల రూపాయలతో తనకంటూ ఒక నివాసం నిర్మించుకుంటున్నారని ఆరోపించారు.

**కాంగ్రెస్ నాయకులను చెప్పుతో కొట్టాలా?**

అధికారంలోకి రాగానే హైడ్రా పేరుతో వందల మంది ఇళ్లు కూలగొట్టిన రేవంత్ రెడ్డి. అటు రామగుండం, మహబూబ్ నగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఇబ్బంది కలిగేలా వారి జీవితాలను చిన్నాభిన్నం చేసేలా ఇళ్లు కూలగొడుతున్నారన్నారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం తన అనుచరులకు, అన్నదమ్ములకు, కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు ఇవ్వడం కోసం మూసీ పేరుతో భారీ స్కామ్ కు తెరలేపారని, ఇందుకోసం పేదల ఇళ్లను పణంగా పెడుతున్నారన్నారని ఆరోపించారు. గతంలో మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం 16 వేల కోట్ల రూపాయలతోనే మూసీ సుందరీకరణ కార్యక్రమాన్ని ఒక్క ఇల్లు కూడా పోకుండా డీపీఆర్ ని కూడా సిద్ధం చేశామన్నారు. ఈరోజు మూసీ బఫర్ జోన్‌కి సంబంధించి రకరకాల మాటలు చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోజు అధికారంలో ఉన్నప్పుడు ఇదే అపార్ట్‌మెంట్లకు పర్మిషన్ ఇచ్చిందన్నారు. మరి అలాంటి అధికారులపై ఆనాడు అనుమతులు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులను చెప్పుతో కొట్టాలా అని కేటీఆర్ ప్రశ్నించారు.

**బెదిరింపులకు దిగడం మానండి**

మూసీలో ఇళ్లు ఉన్నాయని అబద్ధాలు చెప్తూ పేదల ఇళ్లను ధ్వంసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం తన సొంత మంత్రులు, తమ పార్టీ ప్రజా ప్రతినిధులకు ఉన్న ఫార్మ్‌హౌస్‌లు, విల్లాలను, ఇళ్లను ఎందుకు ముట్టుకోవడం లేదన్నారు. రాష్ట్రాన్ని ఒక రియల్ ఎస్టేట్ బ్రోకర్ నడుపుతున్నాడని, అందుకే ఇన్ని రకాల ఇబ్బందులు వస్తున్నాయన్నారు. రేవంత్ రెడ్డి లాంటి భూ బకాసురుడి నుంచి, ఈ బ్రోకర్ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదని కేటీఆర్ పిలుపునిచ్చారు. మూసీ బాధితుల కోసం భారత రాష్ట్ర సమితి అన్ని రకాలుగా అండగా ఉంటుందని కేటీఆర్ తెలిపారు. వీరికి సంబంధించిన న్యాయ పోరాటంలోనూ పార్టీ అండగా ఉంటుందని కేటీఆర్ భరోసా ఇచ్చారు.

## దద్దరిల్లిన పశ్చిమాసియా

తమ సుప్రీం లీడర్ ఖమేనీ మృతి నేపథ్యంలో ఇరాన్ తీవ్రంగా స్పందించింది. తాజాగా పశ్చిమాసియాలోని 27 అమెరికా సైనిక స్థావరాలే లక్ష్యంగా క్షిపణులు, డ్రోన్లతో ప్రతిదాడులకు దిగింది. దీంతో పలు దేశాల్లో భారీగా పేలుళ్లు జరిగాయి. ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ దళాలు నిన్నటి నుంచి ఆరోసారి పశ్చిమాసియాలోని అమెరికా స్థావరాలపై దాడులు నిర్వహించాయి. మొత్తం 27 బేస్‌లను లక్ష్యంగా చేసుకున్నట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. వీటిలో ఇజ్రాయెల్‌లోని టెల్ నోఫ్ ఎయిర్ బేస్, ఇజ్రాయెల్ ఆర్మీ ప్రధాన కార్యాలయం హాకిర్యా కూడా ఉన్నాయి. దీంతోపాటు ఇజ్రాయెల్‌లోని రక్షణరంగ ఫ్యాక్టరీలను కూడా ఇరాన్ టార్గెట్ చేసుకుంది. ఖతార్ గగనతలం ఆదివారం ఉదయం 7.30 సమయంలో పేలుళ్లతో దద్దరిల్లింది. దాని రాజధాని దోహాలో మొత్తం 11 పేలుళ్లు జరిగాయి. మరోవైపు ఇజ్రాయెల్ వ్యాప్తంగా సైరన్లు మోగుతూనే ఉన్నాయి. దుబాయ్‌లో మూడు భారీ పేలుళ్లు సంభవించాయి. ఉదయం 8.15 సమయంలో ఇవి చోటు చేసుకున్నాయి. ఇరాన్ ప్రయోగించిన ఆయుధాలను ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు గగనతలంలోనే పేల్చిసినట్లు తెలుస్తోంది. శకలాలు కూలడంతో దుబాయ్‌లో అత్యంత రద్దీగా ఉండే జబిల్ అలీ పోర్టులో భారీగా మంటలు చెలరేగాయి.

## పేలుడు పదార్థాల కంపెనీలో భారీ విస్ఫోటనం

**మొదటి పేజీ తరువాయి...**

రౌల్‌గావ్ గ్రామంలో ఉన్న ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్ పేలుడు పదార్థాల తయారీ యూనిట్‌లో ఆదివారం తెల్లవారుజామున ఘటన జరిగింది. ఉదయం 7 నుంచి 7.15 గంటల మధ్య డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో ఒక్కసారిగా భారీ పేలుడు సంభవించినట్లు అధికారులు తెలిపారు.

**సహాయక చర్యలు చేపట్టిన అధికారులు**

పేలుడు తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే, ఫ్యాక్టరీ భవనం పూర్తిగా ధ్వంసమై శిథిలాలు సుమారు 500 నుంచి 700 మీటర్ల దూరం వరకూ ఎగిరి పడింది. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఉన్న స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పేలుడు తర్వాత అక్కడ భారీ అగ్ని ప్రమాదం కూడా చెలరేగింది. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బంది సుమారు నాలుగు గంటల పాటు తీవ్రంగా శ్రమించారు. అనంతరం మంటలను అదుపులోకి తెచ్చి సహాయక చర్యలను వేగవంతం చేశారు.

**మృతుల్లో ఎక్కువ మంది మహిళలే**

పోలీసుల ప్రకారం, ఘటనాస్థలంలో పనిచేస్తున్న కార్మికుల్లో 17 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఎక్కువ మంది మహిళా కార్మికులే ఉన్నట్లు తెలుస్తోంది. మరో 18 మంది తీవ్ర గాయాలతో బయటపడ్డారు. గాయపడిన వారిని తక్షణమే నాగ్‌పూర్ నగరంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. కొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్ హర్ష్ పొద్దార్ సహా ఉన్నతాధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

సహాయక చర్యలకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి శిథిలాల మధ్య చిక్కుకున్న వారిని బయటకు తీసేందుకు చర్యలు చేపట్టాయి. అదేవిధంగా పేలుడు పదార్థాల భద్రతను పర్యవేక్షించే సంబంధిత విభాగాల బృందాలు కూడా ఘటనాస్థలానికి చేరుకున్నాయి. ఆ ఫ్యాక్టరీలో గనుల పరిశ్రమలు, మౌలిక వసతుల ప్రాజెక్టుల కోసం అవసరమైన పారిశ్రామిక పేలుళ్లు, డిటోనేటర్లు, అనుబంధ ఉత్పత్తులు తయారు చేస్తారు. డిటోనేటర్ ప్యాకింగ్ యూనిట్‌లో ఏదైనా సాంకేతిక లోపం లేదా నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం జరిగి ఉండొచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. అయితే అసలు కారణం ఏమిటన్నది దర్యాప్తు అనంతరం స్పష్టమవుతుందని తెలిపారు.

**మొత్తం సీల్**

రాష్ట్ర ప్రభుత్వం ఘటనపై తీవ్ర విచారం వ్యక్తం చేసింది. మృతులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబాలకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చింది. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆదేశించింది. అలాగే ప్రమాదానికి గల కారణాలపై సవివర విచారణకు ఆదేశాలు జారీ చేసింది. ఘటన అనంతరం ఫ్యాక్టరీ పరిసర ప్రాంతాన్ని పూర్తిగా సీల్ చేశారు. అయితే ఘటనపై సీఎం దేవేంద్ర ఫడణవీస్ స్పందించారు. పేలుడు సంఘటన చాలా దురదృష్టకరమని తెలిపారు. "నేను స్థానిక పరిపాలనతో నిరంతరం సంప్రదిస్తున్నాను. జిల్లా కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు కూడా ఘటనా స్థలంలో ఉన్నాయి. దర్యాప్తు బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఇప్పటివరకు 17 మంది మరణించారు. 18 మంది గాయపడ్డారు. గాయపడిన వారిని వెంటనే నాగ్‌పూర్‌కు తరలించారు. వారు త్వరగా కోలుకోవాలని నేను దేవుడిని ప్రార్థిస్తున్నాను. ఈ సంఘటనపై సమగ్ర దర్యాప్తునకు ఆదేశించాం" అని తెలిపారు.



## కొత్త పెళ్లికూతురుకు రేవంత్ గిఫ్ట్

### సీఎం రేవంత్‌ను కలిసిన నటి రష్మిక

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన నటి రష్మిక సీఎం అర్ధాంగి గీత, వారి కుమార్తె నైమిషతో సరదాగా గడిపిన వైనం రేవంత్ ఫ్యామిలీతో గడపడం చాలా సంతోషంగా ఉందన్న బ్యూటీఆ గిఫ్ట్‌ను స్పెషల్ అకేషన్‌లోనే ధరిస్తానని రష్మిక ప్రామిస్ కొత్త పెళ్లికూతురు రష్మిక మందన్న తాజాగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఇటీవల టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండతో ఏడడుగులు వేసిన రష్మిక, సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ సీఎం కుటుంబ సభ్యులతో ఆమె కాసేపు ఆప్యాయంగా గడిపారు. ఈ విషయాన్ని రష్మిక స్వయంగా సోషల్ మీడియా వేదికగా వెల్లడిస్తూ తన ఆనందాన్ని పంచుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డితో పాటు ఆయన అర్ధాంగి గీత, ఆయన కుమార్తె నైమిషలను కలవడం చాలా సంతోషంగా ఉందని రష్మిక పేర్కొన్నారు.

## ట్రంప్ పర్యవేక్షణలో... ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ

ఇరాన్‌పై అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'ని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా పర్యవేక్షించారు. సాధారణంగా హైవేల్యూ టార్గెట్లపై జరిగే దాడులే అమెరికా అధ్యక్షుడి కనుసన్నల్లో జరుగుతాయి. తాజాగా ట్రంప్ పర్యవేక్షణకు సంబంధించిన చిత్రాలను శ్వేతసౌధం విడుదల చేసింది. ఫ్లోరిడాలోని పామ్‌బీచ్‌లోని ట్రంప్ స్వగృహం మార్ ఎ లాగో రిసార్ట్‌లోని ఆయన పరిస్థితులను సమీక్షించారు. ట్రంప్‌తో పాటు విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఆర్మీ కీలక జనరల్స్ సుసీ విల్లీస్, డాన్ కెయిన్ తదితరులు కూడా అక్కడే ఉన్నారు. మరోవైపు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా వార్ రూమ్‌లో పరిస్థితిని పర్యవేక్షిస్తున్న చిత్రాన్ని శ్వేతసౌధం పోస్టు చేసింది. ఇప్పటికే అమెరికా అధ్యక్షుడు సౌదీ, ఇజ్రాయెల్ సహా ఇతర గల్ఫ్ నేతలతో కూడా టచ్‌లో ఉన్నట్లు వెల్లడించింది. అమెరికా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ'తోపాటే.. ఇజ్రాయెల్ కూడా 'ఆపరేషన్ రోర్ ఆఫ్ ది లయన్' చేపట్టిన విషయం తెలిసిందే.

## ఖమేనీ మృతికి... బదులు తీర్చుకుంటాం

**మొదటి పేజీ తరువాయి...**

జ్యుడీషియరీ చీఫ్ గులాంహొస్సేన్ మొహసెని ఎజెయి, గార్డియన్ కౌన్సిల్ జ్యూరిస్ట్ ఉంటారని 'ఐఆర్ఎన్ఏ' (ఐఆర్ఎన్ఏ) వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, 88 మంది సభ్యులున్న అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ తదుపరి పూర్తిస్థాయి సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే వరకు ఈ కౌన్సిల్ బాధ్యతలు నిర్వహిస్తుంది. రష్యన్ మీడియా సంస్థ కథనం ప్రకారం 1959లో ఇరాన్‌లోని మేబోద్‌లో జన్మించిన అయతొల్లా అరాఫీ, షియా మతగురువుగా, ఇస్లామిక్ న్యాయ నిపుణుడిగా పేరు పొందారు. 2016 నుంచి ఇరాన్ ఇస్లామిక్ సెమినరీస్ మేనేజ్‌మెంట్ సెంటర్ హెడ్‌గా, ప్రఖ్యాత కోమ్ సెమినరీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. దేశ చట్టాలను, ఎన్నికలను పర్యవేక్షించే శక్తివంతమైన గార్డియన్ కౌన్సిల్‌లో కూడా ఆయన సభ్యుడిగా ఉన్నారు. గతంలో 2008 నుంచి 2018 వరకు అల్–ముస్తఫా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా కూడా అరాఫీ పనిచేశారు.

## బంగాల్‌లో 50 లక్షల మంది చొరబాటుదారులు

అవినీతిలో కూరుకుపోయిన మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ ప్రభుత్వ దుష్పరిపాలన నుంచి బంగాల్‌ను విముక్తి చేయాల్సిన అవసరం ఉందని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అన్నారు. బంగాల్ ప్రజలు ప్రస్తుతం రాష్ట్రంలో పెను మార్పు కోసం తహతహలాడుతున్నారని, నిజమైన 'పరిబోర్తన్' (మార్పు) కోసం ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఆదివారం కూచ్ బెహార్‌లో పార్టీ చేపట్టిన 'పరిబోర్తన్ యాత్ర' ప్రారంభించిన ఆయన, మమతా బెనర్జీ సర్కార్‌పై విమర్శలు గుప్పించారు. ఎస్ఐఆర్ చేపట్టి ఓటర్ల జాబితాలోని అక్రమ చొరబాటుదారులను తొలగించే ప్రయత్నం ఎలక్షన్ కమిషన్ చేస్తే, దానిని మమతా బెనర్జీ అడ్డుకునే ప్రయత్నం చేశారని నితిన్ నబీన్ ఆరోపించారు. "మమతా బెనర్జీ తన పార్టీ ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవడం కోసం, ఓటర్ల జాబిలోని చొరబాటుదారులకు రక్షించేందుకు సుప్రీంకోర్టుకు వెళ్లారు" అని విమర్శించారు. అయితే ఈసీ మాత్రం బంగాల్ యువత ఉద్యోగులను కొల్లగొడుతున్న సుమారు 50 లక్షల మందికిపైగా అక్రమ చొరబాటుదారుల పేర్లను ఓటర్ జాబితా నుంచి తొలగించామని, రాష్ట్రంలో అక్రమ వలసదారుల కాలం చెల్లిందని అన్నారు. ఎస్ఐఆర్ పూర్తి చేసిన తర్వాత బంగాల్ ఓటర్ జాబితా నుంచి 63.66 లక్షల పేర్లను తొలగించినట్లు ఈసీ ఇంతకు ముందే ప్రకటించిన నేపథ్యంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.

"వాస్తవానికి ఓటర్ జాబితా నుంచి తొలగించబడిన వారంతా చొరబాటుదారులే. వారు అసలైన పౌరులకు చెందాల్సిన ప్రభుత్వ ఉద్యోగాలను, సంక్షేమ పథకాల ప్రయోజనాలను అక్రమంగా అనుభవిస్తున్నారు. పైగా వాళ్లు దేశ భద్రతకు ముప్పుగా పరిణమించారు. మమతా బెనర్జీ అక్రమ చొరబాటుదారుల కోసం నకిలీ పత్రాలు సృష్టించి రక్షణ కల్పించారు. కానీ ఇప్పుడు మనం కేవలం చొరబాటుదారులను రాష్ట్రం నుంచి తరిమి వేయడమే కాకుండా, బంగాల్‌లోని అభివృద్ధిని పరుగులు పెట్టించే ఒక నిర్ణయాత్మక ప్రభుత్వాన్ని స్థాపించాల్సిన అవసరం ఉంది.

**మమతా ఓటు బ్యాంక్ రాజకీయం**

'మమతా బెనర్జీ ఓటర్ల జాబితాలోని చొరబాటుదారులను కాపాడుకోవడం కోసం కోర్టులకు పరుగులు తీశారు. ఎందుకంటే వారే ఆమె పార్టీకి ఓటు బ్యాంక్. కానీ రాష్ట్రంలో మహిళలు అవమానాలకు గురవుతుంటే మాత్రం, ఆమె కళ్లు మూసుకున్నారు' అని నితిన్ ఆరోపించారు.

# అమరవీరులకు మరణం లేదు
# జగతి ఉన్నంతకాలం సజీవంగా జీవించే ఉంటారు

**ఖానాపురం లక్ష్మణ్ మాదిగ**
**మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా అధ్యక్షులు**



**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 1 ప్రజా దివాస్**
మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగారాజన్న సిరిసిల్ల జిల్లా అంబేద్కర్ టార్చి దగ్గర మాదిగ అమరవీరులకు ఘన నివాళులు అర్పిస్తూమాటాడుతూమాదిగ అమరవీరులారా జాతి త్యాగదనులారా మీ త్యాగాలను జాతి ఎన్నటికీ మరువదు మీ పోరాట స్ఫూర్తిని ఎన్నటికీ విడవదు ప్రాణ త్యాగం కంటే మించిన త్యాగం ఈ విశ్వంలో మరొకటి లేదుమీరు చిందించిన నెత్తుటి చుక్కల సాక్షిగా శ్రీ వర్గీకరణను సాధించాం అది సంపూర్ణంగా ఉండేలా జాతి కోసం సమాజ హితం కోసం మాన్యులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ గారి సారథ్యంలో మీ యాదిలో ఆశయాల దారిలో శ్రమిస్తాం భవిష్యత్ తరాలకు మీ త్యాగాలను చరిత్రగా అందిస్తాంజోహార్లుతేలబండ్ల రవి మాదిగసిరా నాగేశ్వరరావు మాదిగమీరా సాహెబ్ మాదిగగింజరప్రభాకర్ మాదిగపొన్నాల సురేంద్ర మాదిగనడిమిండ్ల దామోదర్ మాదిగములుగు మహేష్ మాదిగదర్శనాల భారత మాదిగపెద్దాడ ప్రకాష్ రావు మాదిగరాజ ఎల్లన్న మాదిగయుద్ధంచేస్తూ అమరత్వం పొందిన వాళ్లు వీరైతే ఎందరో పోరాట వీరులు ఉద్యమిస్తూ అనారోగ్య కారణాల రీత్యా అశువులు భాష రూ వారందరికీ నివాళులు అర్పిస్తున్నాం 30 ఏళ్లు ఒక తరం ఈ ఉద్యమంలో భాగమై మంద కృష్ణ అన్న పిలుపుమేరకు శ్రమించారు వారందరికీ ఉద్యమ జేజేలు పలుకుతున్నాం

**త్యాగాలు విలువైనవి**
జోహార్లుమాదిగ అమరవీరులకు జోహార్ జోహార్ఈ కార్యక్రమంలోఆవునూరి ప్రభాకర్ మాదిగ రాష్ట్ర నాయకులు ఎమ్మార్పీఎస్కానాపురం లక్ష్మణ్ మాదిగ ఎంఎస్పీ జిల్లా అధ్యక్షులుఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల బిక్షపతి మాదిగఅడవికెటె వెంకట్ విహెచ్పిఎస్ జిల్లా కన్వీనర్పడిమెల శోభ రాణిగద్దరాసి భగవంతంమాదిగనేరెళ్ల శ్రీనివాస్ మాదిగనల్ల బాబు మాదిగరాజశేఖర్ మాదిగమల్యాల ప్రలాద్ మాదిగప్రతాప్ మాదిగఅంతడుపుల తిరుపతి మాదిగ మల్లారపు రాజయ్య

# మానవత్వం చాటుకున్న భవన నిర్మాణ కార్మిక సంఘం

**- మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం**
**- కోనాయిపల్లిలో విషాదం: అనారోగ్యంతో కార్మికుడి మృతి.. అండగా నిలిచిన తోటి కార్మికులు**
**- వేములవాడ: నేదూరి దేవయ్య కుటుంబానికి రూ. 11 వేల ఆర్థిక సాయం అందజేత**



**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 1 ప్రజా దివాస్**
వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కోనాయిపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మికుడు నేదూరి దేవయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంపై భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం మృతుని కుటుంబాన్ని పరామర్శించిన సంఘం సభ్యులు, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఓదార్చారు. అనంతరం, బాధిత కుటుంబానికి సంఘం తరపున రూ. 11,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు రాచర్ల దేవయ్య మాట్లాడుతూ.. దేవయ్య మృతి చెందడం కార్మిక లోకానికి తీరని లోటని, ప్రభుత్వం వారి కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఎల్లప్పుడూ ప్రతి కార్మికుడి క్షేమం కోసం, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి రాగల్ల మల్లేశం, సభ్యులు రాగల్ల గంగరాజు, దొంతరవేణి లింబాద్రి, కోరేపు మల్లేశం, నరసయ్య తదితరులు పాల్గొని మృతునికి నివాళులు అర్పించారు.

# వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా: కౌన్సిలర్ ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి





**వేములవాడ మార్చి 1 ప్రజా దివాస్** నూతన కౌన్సిలర్ దంపతులకు రజక, గౌడ సంఘాల ఆధ్వర్యంలో ఘన సన్మానంసమస్యల పరిష్కారమే లక్ష్యం: కౌన్సిలర్ ఏనుగు జ్యోతివిలీన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట: కౌన్సిలర్ హామీఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతా.. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు: ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డివేములవాడ.మున్సిపాలిటీలో నూతనంగా విలీనమైన శాత్రాజుపల్లి గ్రామ 2వ వార్డు కౌన్సిలర్గా ఎన్నికైన ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి గారికి స్థానిక రజక సంఘం మరియు గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మాన కా ర్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం, రజక సంఘం అధ్యక్షులు మరియు కార్యవర్గ సభ్యులు ఆమెను శాలువాలతో కప్పి, పూలవ ాలలతో ఘనంగా అభినందించారు.ఈ సందర్భంగా ఏనుగు జ్యోతి తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. తన గెలుపుకు సహకరించిన వార్డు ప్రజలకు, అండగా నిలిచిన వివిధ సంఘాల సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విలీన గ్రామమైన శాత్రాజుపల్లిలో అనేక సమస్యలు ఉన్నాయని, ముఖ్యంగా 2వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం, సిసి రోడ్ల నిర్మాణం మరియు మంచినీటి సమస్యల పరిష్కారానికి తాను నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో విలీనమైన తర్వాత వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఆదర్శవంతమైన వార్డుగా తీర్చిదిద్దడమే తన ప్రథమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రజక, గౌడ సంఘాల ప్రతినిధులు, వార్డు ప్రముఖులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## దక్షిణ కాశీలో ఆధ్యాత్మిక సందడి.. ఆదివారం భీమన్న సన్నిధిలో ప్రత్యేక పూజలు

**రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మార్చి 1 ప్రజా దివాస్** దక్షిణ కాశీగా పేరుగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా ఆధ్యాత్మిక శోభతో సంతరించుకుంది. వేకువజాము నుండే భక్తులు ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించి, భీమేశ్వర స్వామి వారిని దర్శించ ుకునేందుకు క్యూలైన్లలో వేచి ఉన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తులు స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు చేసిన శివనామస్మరణతో ఆలయ వీధులు మారుమోగాయి.



## జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు:జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే



**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 1 ప్రజా దివాస్** శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల (మార్చ్ 1వ తేది నుండి 31 వరకు) పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు.దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు,రాస్తా రోకోలు,నిరసనలు,ర్యాలిలు,పబ్లిక్ మీటింగ్ లు,సభలు,సమావేశాలు నిర్వహించరదాని,నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు.కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని సూచించారు.

## మాదిగ అమరవీరులకు నివాళి




**ముస్తాబాద్ మార్చి 1 ప్రజా దివాస్** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందర మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షులు కొమ్మెట రాజు ఆధ్వర్యంలో మాదిగ రిజర్వేషన్ పోరాట వీరులకు ఘన నివాళి అర్పించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సుదీర్ఘ పోరాటం ద్వారా కొందరు అమరవీరుల త్యాగ ఫలితంగా నాడు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పట్టు విడవని విక్రమార్కుల ఎన్నో ఉద్యమాలు చేయడం వలన ఎస్సీ వర్గీకరణ నేడు అమలు జరుగుతుంది వర్గీకరణ అమలు కోసం అసువులు బాసిన అమరవీరులకు ఘన నివాళి అర్పించారు ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు కొల్లూరి నాగరాజు ఎమ్మెస్ ఎఫ్ నాయకులు నల్లబాబు సీనియర్ నాయకులు సుంచు మల్లయ్య శీలం వెంకటేష్ సాకలి రాజు కొల్లూరు మనోజ్ ఎడ్ల మైపాల్ సాకలి బాల నరసయ్య ఎడ్ల వెంకటయ్య ముక్క నరసయ్య తదితరులు పాల్గొన్నారు

## బడుగు బలహీన వర్గాలకు అండగా మానవత్వాన్ని చాటుకున్న పల్లా కిరణ్



**ఖమ్మం ప్రతినిధి మర్చి 1ప్రజా దివాస్** ల పీడిత ప్రజల నాయకులు, పేదల పక్షపాతి స్వర్గీయ క్రీ. శే. పల్లా జాన్ రాములు కుమారుడు ప్రముఖ సమాజ సేవకులు, యువ నాయకులు పల్లా కిరణ్ ఆధ్వర్యంలో "ఉచిత మెగా కంటి వైద్య శిబిరం" మరియు "రక్తదాన శిబిరానికి" భారీ స్పందన తో విజయవంతమైంది.ఖమ్మం ప్రముఖ మిషన్ హాస్పిటల్ ప్రాంగణం లో పల్లా కిరణ్ చే నిర్వహించబడిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరము" మరియు రక్తదాన శిబిరం భారీగా విజయవంతమైంది.ఈ శిబిరానికి సుమారు 1000 మందికి పైగా కంటి సమస్యలతో బాధపడుతున్న పేద, మధ్య తరగతి ప్రజలు పాల్గొని, నిపుణులైన డాక్టర్ల తో వైద్యం చేయించుకున్నారు. వీరికి ఉచితంగా కంటికి సంబంధించిన మందులు మరియు కళ్ళజోళ్ళు పల్లా కిరణ్ ఉచితంగా అందజేశారు.పల్లా కిరణ్ పిలుపుతో పెద్దఎత్తున దాతలు రక్తదానం చేశారు.ఈ రక్తదాన శిబిరం లో దాతలు ఇచ్చిన రక్త యూనిట్స్ ని సేకరించి, నిరుపేదలకు ఉపయోగపడే విధంగా పల్లా కిరణ్ గవర్నమెంట్ హాస్పిటల్ కి అందజేశారు.ఈ మెగా కంటి వైద్య శిబిరానికి"వాసన్ ఐ కేర్" నుంచి నిపుణులైన వైద్యులు, సిబ్బంది వారి సేవలను అందించారు. ఈ సందర్భంగా పల్లా కిరణ్ మాట్లాడుతూ, గత 20 సంవత్సరాలుగా వివిధ వర్గాల ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు ఉదాహరణకు సంవత్సరానికి 2 రెండు సార్లు ఉచిత మోగా వైద్య శిబిరం నిర్వహించుట, కరోనా సమయంలో 3000 మందికి మామిడికాయ పచ్చడి పంపిణీ, ప్రైవేటు టీచర్స్ మరియు పేదలకు బియ్యం, నిత్యవసర సరుకులు పంపిణీ, వరదల సమయంలో నిత్యం అందుబాటులో ఉంటూ వరద బాధితులకు ఆహారం, నీరు, నిత్యవసర సరుకులు మరియు బట్టలు పంపిణి ఇలా అన్ని వర్గాల ప్రజలకు అనేక సందర్భాల్లో అన్న దానాలు, నిరుపేద విద్యార్థిని, విద్యార్థులకు ప్రాథమిక మరియు ఉన్నత విద్య కొరకు ఆర్థిక సహాయం. వృద్ధులకు, వికలాంగులకు, మహిళలకు, అనాధ బాలబాలికలకు మరియు యువతకు నిత్యం అనేక విధాలుగా అండగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తు అండగా ఉండడం సంతోషంగా ఉన్నదని వ్యక్తం చేశారు.




# హుషారు పిట్టలు నుంచి మంగళస్నానం పాట విడుదల

అన్ను, వాసవి గణెళిషన్ జంటగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిల్మ్స్ విడుదల చేస్తుండటంతో ట్రేడ్ వర్గాల్లో మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన టీజర్‌కు భారీ స్పందన రాగా, తాజాగా ఈ చిత్రం నుంచి 'మంగళస్నానం' అనే హార్ట్ టచింగ్ ఎమోషనల్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. పాట ఒక తండ్రి తన కూతురిని ఎంత అల్లారుముద్దుగా పెంచుకుంటారో, ఆమెపై ఎంతటి ప్రాణాన్ని పెట్టుకుంటారో అద్భుతంగా ఆవిష్కరించింది. తండ్రీకూతుళ్ల మధ్య ఉండే విడదీ-యలేని అనుబంధానికి ఈ గీతం అద్దం పడుతోంది. ఎస్.ఎస్. చిరంజన్ హృద్యమైన సాహిత్యం అందించగా, యోగి సురేష్ మరియు విహా తమ గాత్రంతో ప్రాణం పోశారు. చరణ్ అర్జున్ అందించిన సంగీతం ఈ పాటకు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. పాట విడుదల సందర్భంగా దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. 'తండ్రీకూతుళ్ల మధ్య ఉండే స్వచ్ఛమైన ప్రేమను ఈ పాటలో చూపించాం. ఈ సినిమా కేవలం యువతకే కాదు, తల్లిదండ్రులు కూడా చూడాల్సిన ఒక చక్కని కుటుంబ కథా చిత్రం. నా నిజ జీవితంలో నేను చూసిన యదార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమాను రూపొందించాను. యువతకు కావాల్సిన హుషారును ఇస్తూనే, ఒక సరికొత్త థ్రిల్‌ను ఈ సినిమా పంచుతుంది' అని తెలిపారు. నిర్మాత వెంకట్ యాదవ్ మాట్లాడుతూ.. 'సినిమా ప్రథమార్థం అంతా యూత్‌ఫుల్ కంటెంట్‌తో ఎంటర్టైన్ చేస్తే, ద్వితీయార్థంలో ఒక మెచ్యూర్డ్ పాయింట్ ఉంటుంది. సమాజంలో బాధ్యతాయుతమైన విషయాన్ని వినోదాత్మకంగా చెప్పే ప్రయత్నం చేశాం. ప్రతి ఒక్కరూ ఈ సినిమా చూశాక ఒక బాధ్యతను గుర్తిస్తారు. నటీనటులందరూ చాలా సహజంగా నటించారు. కచ్చితంగా ఇది పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం మాకుంది' అని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలోనే ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రంలో అన్ను, వాసవి గణెళిషన్‌లతో పాటు గోవర్ధన్, సునీత్ మనోహర్, రమేష్, బలగం బాబు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# స్పిరిట్ నుంచి వివేక్ ఒబెరాయ్ లుక్ విడుదల

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న హై రేంజ్ యాక్షన్ థ్రిల్లర్ 'స్పిరిట్'పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. తాజాగా చిత్రబృందం విడుదల చేసిన విలన్ ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బాలీవుడ్ నటుడు వివేక్ ఒబెరాయ్ ఈ చిత్రంలో ప్రతినాయకుడిగా నటిస్తున్న సంగతి తెలిసిందే. 'వన్ బ్యాడ్ హ్యాబిట్ ఇన్ స్పిరిట్ మోడ్' అనే ట్యాగ్‌తో విడుదల చేసిన పోస్టర్‌లో వివేక్ ఒబెరాయ్ నోట్లో సిగార్‌తో పవర్‌ఫుల్ యాక్షన్ లుక్‌లో కనిపించారు. పోస్టర్‌ను బట్టి ఆయన ఓ డాన్ పాత్రలో కనిపించనున్నట్లు అర్థమవుతోంది. అయితే అదే పోస్టర్‌లో వివేక్ పక్కన కనిపించిన యువతి ఎవరు? అనే చర్చ సోషల్ మీడియాలో మొదలైంది. ఆమె పేరు ఐశ్వర్య దేశాయ్. యూనివర్సిటీ ఆఫ్ మేరీల్యాండ్ నుంచి మార్కెటింగ్‌లో డిగ్రీ పూర్తి చేసిన ఇండో-అమెరికన్ నటి. బాలీవుడ్ చిత్రం 'గల్లీ బాయ్'లో నటించిన ఆమె, 'ర్యాట్ ఇన్ ద కిచెన్' అనే షార్ట్ ఫిల్మ్‌తో మంచి గుర్తింపు పొందారు. ఆ చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా అవార్డు కూడా అందుకున్నారు. ఇప్పుడు 'స్పిరిట్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయం అవుతున్నారు. పోస్టర్‌లో వివేక్‌తో కలిసి కనిపించడం వల్ల సినిమాలో ఆమెకు కీలక పాత్ర ఉన్నట్టు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఒక్క పోస్టర్‌తోనే ఆమెకు మంచి క్రేజ్ వచ్చింది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన త్రిప్తి డిమ్రి హీరోయి-న్‌గా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, లుక్స్ ప్రేక్షకుల్లో గూస్‌బంప్స్ తెప్పించాయి. విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కీలకపాత్ర పోషిస్తుండగా, సీనియర్ నటి కాంచన కూడా ప్రధాన పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాలో ప్రభాస్ ఇప్పటివరకు చూడని విధంగా ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. మాఫియా బ్యాక్‌డ్రాప్‌తో పాటు పోలీస్ డ్రామా ఎలిమెంట్స్ కూడా ఉండనున్నట్లు టీజర్ సూచిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రం తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళం భాషలతో పాటు చైనీస్, కొరియన్ సహా పలు విదేశీ భాషల్లో వచ్చే ఏడాది మార్చి 5న విడుదల కానుంది.

# దురంధర్ పార్ట్2 విడుదలకు సిద్ధం

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, స్టార్ దర్శకుడు ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివేంజ్' విడుదలకు సిద్ధమవుతోంది. అయితే ఈ సినిమా రన్ టైమ్ వివరాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ సినిమా నిడివి 220 నిమిషాలుగా ఉన్నట్లు సమాచారం. అంటే ఈ చిత్రం దాదాపు 3 గంటల 40 నిమిషాల సుదీర్ఘ రన్ టైమ్‌తో ప్రేక్షకులను అలరించబోతుంది. మొదటి భాగం 3 గంటల 34 నిమిషాలు తో పోలిస్తే ఇది 6 నిమిషాలు ఎక్కువ ఉన్నప్పటికీ, ప్రస్తుత కాలంలో అత్యంత సుదీర్ఘమైన నిడివి కలిగిన చిత్రాల జాబితాలో ఇది ఒకటిగా నిలుస్తోంది. ఈ చిత్ర కథాంశం విషయానికి వస్తే, మొదటి భాగంలో గ్యాంగ్‌స్టర్ రెహ్మాన్ డకైట్‌ను అంతం చేసిన తర్వాత, హమ్జా అలీ మజారీ పాత్రలో రణవీర్ సింగ్ తన తదుపరి లక్ష్యమైన ఐఎస్ఐ వ్యూహకర్త 'బడే సాబ్' (మేజర్ ఇక్బాల్)ను ఎలా ఎదుర్కొన్నాడు అనే ఉత్కంఠభరితమైన అంశాలతో ఈ సీక్వెల్ సాగనుంది. రణవీర్ సింగ్‌తో పాటు ఈ చిత్రంలో సంజయ్ దత్, ఆర్. మాధవన్, అక్షయ్ ఖన్నా మరియు అర్జున్ రాంపాల్ వంటి దిగ్గజ నటులు కీలక పాత్రల్లో నటిస్తుండగా, సారా అర్జున్ కథానాయికగా నటించింది. ఈ భారీ యాక్షన్ ఎంటర్టైనర్ మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. అదే రోజున కన్నడ స్టార్ యాష్ నటిస్తున్న 'టాక్సిక్' కూడా విడుదలవుతుండటంతో బాక్సాఫీస్ వద్ద ఈ రెండు భారీ చిత్రాల మధ్య గట్టి పోటీ నెలకొననుంది.







# విష్ణు విన్యాసం మూవీ లీక్

## అందుకే త్వరగా విడుదల చేశాం

'విష్ణు విన్యాసం' మూవీ లీక్ అవడం వల్ల చాలా విషయాలు జరిగాయని అందుకే వారం గ్యాప్‌తో తన రెండు సినిమాలు విడుదల చేయాల్సి వచ్చిందని శ్రీవిష్ణు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో శ్రీవిష్ణు మాట్లాడారు. 'సినిమా లీక్ అవడం వల్ల షూటింగ్ హడావుడిగా అయిందన్నారు. స్క్రిప్ట్‌లో ఏమైనా మార్పులు చేశారా' అని అడగ్గా, 20 రోజుల పనిని ఏడు రోజుల్లో రాత్రి, పగలూ విరామం లేకుండా చేయాల్సి వచ్చింది. టీమ్ అంతా సహకారం అందించారు. అలా చేస్తేనే ఈ టైమ్‌కు రాగలిగాం. పూర్తి ప్లానింగ్ లేకుండా ప్రచార కార్యక్రమాలు మొదలుపెట్టాల్సి వచ్చింది. దానివల్లే రెండు సినిమాలు ఒకదాని తర్వాత ఒకటి వచ్చాయి. చెన్నై నుంచి ఈ సినిమాను లీక్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేశాం. దీనిపై కేసు నడుస్తోంది. మా నిర్మాతని బ్లాక్ మెయిల్ చేశారు. ఆయనను బెదిరిస్తూ వాళ్లు పెట్టిన సందేశాలు, ఛాంబర్‌కు మేము చేసిన ఫిర్యాదులు అన్నీ మా దగ్గర ఉన్నాయి. భవిష్యత్‌లో ఇలాంటి సమస్యలు రాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలన్న దానిపై చర్చించాలి. ప్రతి రీల్‌కు నిర్మాతను బ్లాక్ మెయిల్ చేశారు. విడుదల ముందురోజు వరకూ ఇదంతా జరిగింది. ఆ విషయంలో నిర్మాత చాలా ఇబ్బందిపడ్డారు. అలాగని మమ్మల్ని ఆందోళనకు గురి చేయలేదు' అని శ్రీవిష్ణు తెలిపారు. నిర్మాత సుమంత్ నాయుడు మాట్లాడుతూ.. 'వరుసగా ఈ సినిమాకు సంబంధించిన వీడియోలను నాకు పంపారు. ఆ సందేశాలు చూడగానే నా భవిష్యత్ కళ్ల ముందు కనపడింది. మా యూనిట్ నుంచే తెలియకుండా సన్నివేశాలు వెళ్లిపోయాయి. మాకు సినిమా క్లిప్‌లను పంపిన నెంబర్‌ను ట్రేస్ చేశాం. ఆ తర్వాత ఛాంబర్‌లో ఫిర్యాదు చేశాం. చాలా మానసిక క్షోభ అనుభవించాం. పరిస్థితి అదుపు తప్పడంతోనే మిగిలిన షూటింగ్ వేగంగా పూర్తి చేసి, ఈ సినిమాను తీసుకురావాల్సి వచ్చింది. అంతేకానీ, 'మృత్యుంజయ్' మూవీకి పోటీగా దీన్ని విడుదల చేయాలన్న ఉద్దేశం మాకు లేదు. ఆ చిత్ర నిర్మాత పరిస్థితిని అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా అని అన్నారు.